https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 101 మంగళవారం 18-08-2026 పేజీలు : 4

**రిపోర్టర్స్ కావలెను**

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## బాంబులేసి పేల్చి పారేస్తాం..

### మిత్రదేశం ఒమన్‌కు ట్రంప్ వార్నింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17 :



ఇంటర్నెట్ డెస్క్: హోర్ముజ్ జలసంధిలో భద్రమైన రవాణా మార్గంపై ఒమన్‌తో అవగాహన కుదిరిందని ఇరాన్ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఇరాన్ విషయంలో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తే బాంబులేసి పేల్చేస్తామని మిత్రదేశం ఒమన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. 'ఒమన్ మధ్యలో అడ్డం వస్తే బాంబులేసి పేల్చి పారేస్తాము' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో శాంతి చర్చలకు సంబంధించి 60 రోజుల గడువు ముగిసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇరాన్‌తో డీల్ విషయంలో తనకు ఎలాంటి తొందర లేదని కూడా ట్రంప్ అన్నారు. హోర్ముజ్‌లో విధించిన దిగ్బంధనంతో ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి అధికంగా ఉందని అన్నారు. హోర్ముజ్‌లో ఇరాన్ పోర్టుల నుంచి నౌకల రాకపోకలు జరగకుండా యూఎస్ నేవీ అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఇక ఒమన్‌తో ఒప్పందానికి సంబంధించి ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి పూర్తి వివరాలు వెల్లడించలేదు. జలమార్గం మ్యాపుపై ఏకాభిప్రాయానికి వచ్చినట్టు మాత్రం చెప్పారు. త్వరలో సంయుక్త ప్రకటన చేసేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని అన్నారు. ఇరాన్‌కు సమీపం నుంచి హోర్ముజ్ జలసంధిలోకి ప్రవేశించి ఒమన్‌కు సమీపం నుంచి బయటకు వచ్చేలా మార్గంపై ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

## పేదల ఆరోగ్యం.. మా బాధ్యత

### సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత**

పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.

తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక



అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

## దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసుల పెండింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17:



దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. పదేళ్లకు పైగా 519 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 5 నుంచి10 ఏళ్ల మధ్య 754 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల సత్వర విచారణపై అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదికను సమర్పించారు. అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికలోని వివరాల మేరకు.. సిట్టింగ్ ఎంపీలపై 335 కేసులు పెండింగ్‌లో ఉండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపీలపై 269 కేసులు.. మాజీ ఎమ్మెల్యేలపై 1,339 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 700 కేసుల దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తులో ఉన్నాయి. ఇక, లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ నివేదిక వెల్లడించింది.

## అరుణ, లక్ష్మణ్ ఔట్

### బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు మొండిచేయి

- ఆంధ్రప్రదేశ్ నేతలకు మూడు పదవులు
- డీకే అరుణ స్థానంలో వైస్ ప్రెసిడెంట్‌గా దగ్గుబాటి పురందేశ్వరి
- ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ స్థానంలో అమర్‌పాల్ మౌర్య
- రాంమాధవ్, వసుంధరా రాజే సహా 13 మంది ఉపాధ్యక్షులు
- అన్ని సెల్స్ సంయుక్త ఇన్‌చార్జిగా విష్ణువర్ధన్ రెడ్డి నియామకం
- నబీన్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన 8 నెలలకు కొత్త టీమ్
- అందులో దక్షిణాదిన ప్రాతినిధ్యం దక్కని ఏకైక రాష్ట్రం తెలంగాణ
- త్వరలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులు?.. అరుణకు చాన్స్?





న్యూఢిల్లీ, ఆగస్టు 17:

బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికైన ఎనిమిది నెలల తర్వాత ఎట్టకేలకు నితిన్ నబీన్ తన టీమ్‌ను సోమవారం ప్రకటించారు. అయితే.. ఈ కొత్త బృందంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా చోటు ఇవ్వకుండా బీజేపీ జాతీయ నాయకత్వం రాష్ట్ర పార్టీకి ఝలక్ ఇచ్చింది. దేశంలోని దాదాపు 23 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన నేతలకు ఈ టీమ్‌లో అవకాశం కల్పించగా.. దక్షిణాదిన ప్రాతినిధ్యం లభించని ఏకైక రాష్ట్రం తెలంగాణ కావడం గమనార్హం. పార్టీ జాతీయ పదాధికారుల కమిటీలో తెలంగాణ ఒక్కరికి కూడా అవకాశం దక్కకపోవడం రాష్ట్ర బీజేపీ చరిత్రలో ఇదే మొదటిసారి. అదే సమయంలో ఏపీకి చెందిన ముగ్గురు నేతలకు (పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డి, ఢిల్లీ కోటాలో రాం మాధవ్) పదవులు దక్కాయి. డీకే అరుణ స్థానంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరిని నియమించారు. అలాగే.. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడుగా ఉన్న కె.లక్ష్మణ్ స్థానంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు అమర్ పాల్ మౌర్యను నియమించారు. ఇక.. పురందేశ్వరితోపాటు, పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధరా రాజే సింధియా, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తీరథ్ సింగ్ రావత్ సహా 13 మందిని పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. జాతీయ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీఎల్ సంతోష్, ప్రధాన కార్యదర్శులుగా వినోద్ తావ్డే, సునీల్ బన్సల్.. సంస్థాగత వ్యవహారాల సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్ ను యథాతథంగా కొనసాగించారు. కేంద్ర వాణిజ్యమంత్రి గోయెల్‌ను మరోసారి పార్టీ కోశాధికారిగా నియమించడంతో ఆయనకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం ఉంటుందా అనే విషయంపై ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఇక.. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్ లను పార్టీ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. ఉత్తరప్రదేశ్‌లో అసంతృప్తిగా ఉన్న బ్రాహ్మణ వర్గాలను దృష్టిలో ఉంచుకుని ఆ రాష్ట్రంలో రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన హరీశ్ ద్వివేదికి కూడా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

## రాహుల్‌పై విచారణను నిలిపివేయండి

- అలహాబాద్ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం
- ఈడీ, సీబీఐ నివేదిక అవసరం లేదని స్పష్టీకరణ
- హైకోర్టు తీరు సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా ఉందని ఆక్షేపణ
- ఆదాయానికి మించిన ఆస్తుల అంశంలో కాంగ్రెస్ నేతకు ఊరట




న్యూఢిల్లీ, ఆగస్టు 17:

ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీకి పెద్ద ఊరట లభించింది. ఈ అంశంలో ఆయనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారణను నిలిపివేయాలని అలహాబాద్ హైకోర్టు (లఖ్‌నవ్ బెంచ్)ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ కేసులో సీబీఐ, ఈడీలు అలహాబాద్ హైకోర్టుకు ఎలాంటి నివేదిక సమర్పించొద్దని స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రాహుల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. బీజేపీ కార్యకర్త ఎస్. విఘ్నేశ్ శిశిర్‌తోపాటు సీబీఐ, ఈడీలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. రాహుల్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల విషయం అంత తీవ్రమైనది అయితే దర్యాప్తు సంస్థలు మౌనంగా ఎందుకు ఉన్నాయి? అని సీబీఐ, ఈడీల తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏదైనా కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు దర్యాప్తు సంస్థలు సొంతంగా చర్యలు చేపట్టొచ్చని, కోర్టు ఆదేశాల కోసం ఎందుకు నిరీక్షించాయని నిలదీసింది. అలాగే, రాహుల్ వాదనలు వినకుండా అలాహాబాద్ హైకోర్టు ఏకపక్షంగా ఆదేశాలు ఇవ్వడాన్ని తప్పుబడుతూ.. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్. విఘ్నేశ్ పిటిషన్ ఆధారంగా.. రాహుల్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సీబీఐ, ఈడీలకు అలహాబాద్ హైకోర్టు మే 12న ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

## ఈ-10 పెట్రోల్‌ను మళ్లీ తేవాలి

- అన్ని బంకుల్లో ఈ-20తో పాటు అందుబాటులో ఉంచాలి
- అప్పుడే వాహనదారుల్లో ఉన్న ఆందోళన తొలగిపోతుంది
- ఈ-20తో ఇంజన్లు పాడవ్వవు.. కానీ వేడెక్కే అవకాశం ఉంది
- ఓ పత్రికకు కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు
- అనంత నాగేశ్వరన్ వ్యాసం - ఈ అభిప్రాయాలు తన వ్యక్తిగతమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 17:





దేశవ్యాప్తంగా ఈ-20పై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) అనంత నాగేశ్వరన్ కీలక, ఆసక్తికర సూచనలు చేశారు. వాహన దారుల ఆందోళన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఈ10 పెట్రోల్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలని అభిప్రా యపడ్డారు. ఈ-20తో పాటు ఈ-10 ఇంధనం కూడా అందుబాటులో ఉండాలన్నారు. అప్పుడే వాహనదారుల్లో ఆందోళన తొలగిపోతుందని పేర్కొన్నారు. అయితే, ఈ20 పెట్రోల్‌తో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయన్న అనుమానాలను ఆయన కొట్టిపారేశారు. కానీ, ఇథనాల్ బ్లెండింగ్ ఇంధనం వల్ల అవి బాగా వేడెక్కే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఈ20 పెట్రోల్‌తో పాత టూవీలర్లలోని రబ్బరు సీల్స్ పాడవుతాయన్నారు. ఈ మేరకు అనంత నాగేశ్వరన్, కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం కన్సల్టెంట్ ఆకాశ్ పూజారీతో కలిసి ఇండియన్ ఎక్స్‌పట?్రసలో వ్యాసం రాశారు. కేంద్రప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో ఉన్న ఓ అధికారి ఈ20 పెట్రోల్‌పై స్పందించడం ఇదే మొదటిసారి. బీఎస్-4 మోడల్ కంటే ముందువి 8కోట్ల టూవీలర్లు ఇంకా రోడ్లపై తిరుగుతున్నాయని అనంతనాగేశ్వరన్ అంచనా వేశారు. ఈ-20 విషయంలో మైలేజీ, ఇంజన్ల కంటే ముఖ్యమైన అంశం పంటల సాగులో మార్పులు అని చెప్పారు.

## ఎన్‌టీఏ ప్రక్షాళన..

### 50 మందికి పైగా సిబ్బంది తొలగింపు..!





న్యూఢిల్లీ: నీట్ యూజీ -2026 పేపర్ లీక్, యూజీసీ నెట్ పరీక్షలో లోపాలు.. పరీక్షల రద్దు.. ఇలా వరుస పరిణామాలతో కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్టీఏ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే దాదాపు 50 మందికి పైగా సిబ్బందిని తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వీరి స్థానంలో 10 కొత్త వృత్తిపరమైన పోస్టులు ఏర్పాటు చేసి, నియామకాలు చేపట్టాలని ఎన్‌టీఏ భావిస్తోందని సమాచారం. ఈ క్రమంలోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి.. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దీప్తి గౌర్ ముఖర్జీ, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎన్‌టీఏ తమ సమగ్ర పరీక్షా విధానాన్ని సంస్కరించడానికి తీసుకున్న చర్యల గురించి కేంద్రమంత్రికి వివరించారు. 50 మందికి పైగా చీూా సిబ్బందిని తొలగించి.. 10 కొత్త వృత్తిప రమైన కీలక పోస్టులకు ప్రకటనలు జారీ చేసి, నియామకాలు చేపడుతున్నట్లు కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. వీటిలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్, టెస్ట్ సెక్యూరిటీ జనరల్ మేనేజర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అండ్ సైకోమెట్రిక్స్ జనరల్ మేనేజర్ వంటి పోస్టులు ఉండనున్నాయి. సైబర్-సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్ర రూపకల్పన, ఇతర ప్రత్యేక రంగాల కోసం చీూా ప్రైవేట్ రంగం నుండి డొమైన్ నిపుణులను కూడా తీసుకోనున్నట్లు సమాచారం. నిర్ధారిత పరీక్షా నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా చూడాలని, కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్ (జూచీూాూ) నిర్మాణాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని ఎన్‌టీఏను కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆదేశించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, తీసుకున్న దిద్దుబాటు చర్యలపై నివేదిక సమర్పించాలని ఎన్‌టిఏను కోరారు.

# నకిలీ విగ్రహంతో మోసం.. ఆరుగురు అరెస్ట్

**లక్ష్మీదేవి విగ్రహం పేరిట మోసయత్నం**

**అరుదైన రాయి అంటూ అమాయకులకు వల**

**టాస్క్‌ఫోర్స్, పోలీసుల సంయుక్త దాడి**

**విగ్రహం, వాహనం, ఫోన్లు స్వాధీనం**

**హైదరాబాద్, ఆగస్టు 17**
నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం, మహిమలు ఉన్నాయంటూ ప్రచారం చేసిన ఓ రాయి పేరిట అమాయకులను మోసం చేసేందుకు ప్రయత్నించిన ఆరుగురు సభ్యుల ముఠాను హైదరాబాద్ నగర పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సంయుక్త చర్యలో ఈ ముఠా గుట్టురట్టైంది. నిందితుల వద్ద నుంచి నకిలీ విగ్రహం, గులాబీ రంగు రాయి, వాహనం, మొబైల్ ఫోన్లు సహా పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ గాయక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెల్లడించిన వివరాల ప్రకారం, కాటేదాన్‌లోని లక్ష్మిగూడ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు నకిలీ పురాతన వస్తువులను అధిక ధరలకు విక్రయించేందుకు కొనుగోలు దారుల కోసం ఎదురుచూస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి దాడి నిర్వహించాయి. విచారణలో మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన కేతావత్ రాజు అలియాస్ కట్టప్ప, హైదరాబాద్‌కు చెందిన పి. నరసింహ, వడత్య కుమార్, ప్రవీణ్ సింగ్, మంగళి బసవ నరేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన చల్లా రవి కలిసి ముఠాగా ఏర్పడినట్లు తేలింది. ప్రజలను నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో ఈ వ్యవహారాన్ని నడిపినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో 2024లో పి. నరసింహ అనే వ్యక్తి నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహాన్ని రూ. 10 లక్షలకు కొనుగోలు చేసి మోసపోయినట్లు వెల్లడైంది. అనంతరం ఆ విగ్రహాన్ని ఇతరులకు అందజేసి, దానికి దివ్యశక్తులు ఉన్నాయని, అదృష్టాన్ని తీసుకొస్తుం దని ప్రచారం చేస్తూ అమాయకులకు కోట్ల రూపాయలకు విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు తెలిసింది. ఇదే సమయంలో కేతావత్ రాజు తన వద్ద ఉన్న గులాబీ రంగు రాయిని అత్యంత అరుదైనదిగా, ప్రత్యేక శక్తులు కలిగినదిగా ప్రచారం చేసి అధిక ధరలకు అమ్మాలని యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఈ రెండు వస్తువులను ఉపయోగించి కొనుగోలుదారులను మోసం చేసే ప్రయత్నం జరుగుతుండగానే పోలీసులు దాడి చేసి వారిని



అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఒక నకిలీ పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం, ఒక గులాబీ రంగు రాయి, ఒక కారు, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు రసాయన ద్రావణాల సీసాలు, రెండు ఎరుపు రంగు తువాళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఇలాంటి మహిమలు, దివ్యశక్తుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# ఆటో డ్రైవర్ ఇంట్లో రూ.3 కోట్లు

**తుపాకీ ఫొటోతో పోలీసులకు సమాచారం**

**ఆయుధాల కోసం వెళ్లిన అధికారులకు షాక్**

**ఇంట్లో నగదు సంచులు స్వాధీనం**

**డబ్బు మూలాలపై దర్యాప్తు ముమ్మరం**



**సాగర్, ఆగస్టు 17**
సామాజిక మాధ్యమాల్లో తుపాకీ పట్టుకుని దిగిన ఫొటోను ఓ యువకుడు పంచుకోవడంతో ప్రారంభమైన అనుమానం చివరకు కోట్ల రూపాయల నగదు స్వాధీనానికి దారితీసింది. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఆటో డ్రైవర్ ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా, ఆయుధాలు కాకుండా భారీ మొత్తంలో నగదు బయటపడింది. సాగర్ జిల్లా గోపాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న రాజేశ్ అహిర్వార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతని కుమారుడు సౌరభ్ అహిర్వార్ తుపాకీతో దిగిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. ఆ ఫొటో వేగంగా వైరల్ కావడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అతని వద్ద అక్రమ ఆయుధాలు ఉన్నాయనే ప్రచారం విస్తరించడంతో పలువురు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. అనుమానితుడి ఇంటికి చేరుకుని క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఇంటి ప్రతి మూలను పరిశీలించినప్పటికీ ఎలాంటి తుపాకులు లేదా ఇతర ఆయుధాలు లభించలేదు. అయితే సోదాల సమయంలో పెద్ద మొత్తంలో నగదు సంచులు కనిపించడంతో అధికారులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంత పెద్ద మొత్తంలో నగదు కనిపించడంతో పోలీసులు నగదు లెక్కించే యంత్రాలను తెప్పించారు. సుమారు ఐదు గంటలపాటు సాగిన లెక్కింపులో మొత్తం నగదు విలువ రూ. 3 కోట్లుగా తేలింది. అనంతరం ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత పత్రాలను పరిశీలించడం ప్రారంభించారు. నగదు మూలాలపై ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులను పోలీసులు ప్రశ్నించారు. అయితే ఆ డబ్బుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. భోపాల్‌లో ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ బంధువుకు చెందిన నగదేనని, తాము కేవలం ఇంట్లో ఉంచినట్లు మాత్రమే పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నగదు అసలు యజమాని ఎవరు, అంత పెద్ద మొత్తంలో డబ్బు ఇంట్లో ఎందుకు ఉంచారు, దానికి సంబంధించిన చట్టబద్ధ ఆధారాలు ఉన్నాయా అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. తుపాకీ ఫొటో కారణంగా మొదలైన దర్యాప్తు కోట్ల రూపాయల నగదు బయటపడటంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కి 19వ వార్డు కౌన్సిలర్ వినతి పత్రం



19వ వార్డులోని కొరివి గేటు నుండి హైమా గార్డెన్ మోడల్ స్కూల్ కి పోయే దారి మధ్యలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ప్రతి ఆదివారం నడిరోడ్డుపై జరిగే పశువుల మేకల గొర్రెల అంగడి వల్ల గత కొన్ని సంవత్సరాల నుండి కొరివి గెట్ ప్రాంతవాసులు హైమా గార్డెన్ వాసులు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న పలుమార్లు అధికారులకు ప్రజా ప్రతినిధులకు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల ఈరోజు ముఖ్యంగా హైమా గార్డెన్ వాసులకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని కౌన్సిలర్ గారికి తెలియజేయగానే ఈరోజు 19వ వార్డు కౌన్సిలర్ చిధిరాల అరుణ గారు వెంటనే స్పందించి ఈరోజు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గారికి సమస్యపై వినతి పత్రం అందజేయడం జరిగింది కలెక్టర్ గారికి కౌన్సిలర్ గారు స్వయంగా సమస్యను వివరించగా వెంటనే కలెక్టర్ గారు స్పందించి మున్సిపల్ కమిషనర్ గారిని పిలిచి తదుపరి జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారు ఆదేశించడం జరిగింది కలెక్టర్ గారిని కలిసిన వారిలో చిదిరాల జ్ఞానేశ్వర్ నవయుగ యూత్ క్లబ్‌అధ్యక్షులు వంకాయలపాటి లెనిన్ బాబు హైమ గార్డెన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ లోయ కోశాధికారి బి శ్రీధర్ క్లబ్ హౌస్ కన్వీనర్ పల్లా జనార్దన్ రెడ్డి రమేష్ ఉన్నారు

## 8 సార్లు అధిష్ఠానానికి ఎన్ని డబ్బులిచ్చావు?

**చిన్నారెడ్డిని నిలదీసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి టౌన్, ఆగస్టు 17 :**
తాను ఎవరికి డబ్బులు ఇచ్చానో నిరూపించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన 8 సార్లు అధిష్ఠానానికి ఆయన ఎంత డబ్బు ఇచ్చి టికెట్ తీసుకున్నారో చెప్పాలని నిలదీశారు. చిన్నారెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై సోమవారం మేఘారెడ్డి స్పందించారు. వనపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి హోదాలో ఉన్న చిన్నారెడ్డి గోపాల్‌పేట సభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. బీఫాం ఇచ్చి లాగేసుకున్నారని అధిష్ఠానంపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన చిన్నారెడ్డి గతంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే జయరాములును కాదని ఆయనకు బీఫాం ఎలా ఇచ్చారో వివరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజలు మేఘారెడ్డిని కోరుకుంటేనే పార్టీ గుర్తించి బీఫాం ఇచ్చిందని చెప్పారు. డబ్బులకు బీఫాంలు అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో ఉందా? అని నిలదీశారు. దీనిపై చిన్నారెడ్డి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలో సీనియర్ నాయకుడని గౌరవిస్తున్నామని, ఆయన మాత్రం పార్టీపై, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసుకుంటూ తిరగడం భావ్యం కాదని హితవు పలికారు. ప్రణాళికా సంఘం పదవి రెన్యువల్ కోసమే పార్టీని, సీఎంను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు.

## "అక్షర శ్రీ" గౌరవ పురస్కారం అందుకున్న సాగంటి మంజుల

**తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియామకం**



**మహబూబాబాద్. ఆగస్ట్ 17:**
విశ్వసాహితీ కళావేదిక జాతీయ సాహితీ సంస్థకు తెలంగాణ రాష్ట్ర లలిత కళల విభాగానికి అధ్యక్షురాలిగా తెలంగాణ హనుమకొండకి చెందిన అధ్యాపకులు, రచయిత్రి, కవయిత్రి, చిత్రకారిణి, సాంగటీస్ ఆర్ట్స్ అకాడమీ అధినేత అయిన డా. సాగంటి మంజులని నియమిస్తున్నట్టు జాతీయ అధ్యక్షురాలు రమావతి తెలిపారు... ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తాడేపల్లి గూడెం లో జరిగిన విశ్వ సాహితీ కళా వేదిక ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో మంజుల తెలుగు సాహిత్య రంగానికి చేస్తున్న సేవకు గాను మాస్ట్రో గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా "అక్షర శ్రీ " విశిష్ట గౌరవ పురస్కారంతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలిగా నియామక పత్రాన్ని మంజులకు అందిస్తూ మంజుల కళలకు చేస్తున్న సేవలకు మరింత గుర్తింపునిస్తూ ఈ నియామకం జరిగిందని... రమావతి మంజులను అభినందించారు..

## దళితుల పట్ల బీజేపీ వైఖరిని ఖండిస్తున్నాం : తిప్పర్తి శ్రీధర్



ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీ జరిగిన ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధీకరణ చేశారంటూ జరిగిన ఘటనకు నిరసనగా,కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారికి సంఘీభావంగా టీపీసీసీ ఎస్సీ విభాగం పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ పట్టణంలోని మహాత్మా గాంధీ, విగ్రహం వద్ద జిల్లాఎస్సీవిభాగం నాయకులు శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు తిప్పర్తి శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారు పాల్గొన్న వేదికను ఒక వర్గం వారు గంగాజలంతో "శుద్ధీకరణ" చేయడం అత్యంత హేయమైన, అవమానకరమైన చర్య అని అన్నారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న నాయకుడిని కులం, సామాజిక నేపథ్యం పేరుతో అవమానించే విధంగా వ్యవహరించడం దేశ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ పెంచి పోషిస్తున్న వివక్షాపూరిత మనస్తత్వానికి హల్ద్వానీ ఘటన నిదర్శనమని తిప్పర్తి శ్రీధర్ విమర్శించారు. సమాజాన్ని ఐక్యంగా ఉంచాల్సిన సమయంలో కుల,మత,వర్గాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఇలాంటి తిరోగమన ఆలోచనలు దేశాన్ని వెనక్కి తీసుకెళ్తాయని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం, మానవ గౌరవాన్ని కల్పించిందని గుర్తుచేశారు. రాజ్యాంగం ముందు అందరూ సమానులేనని,ఎవరినీ వారి కులం, మతం లేదా సామాజిక నేపథ్యం ఆధారంగా అవమానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు."ఖర్గే గారిని అవమానించడం అంటే ఒక్క కాంగ్రెస్ నాయకుడిని అవమానించడం కాదు. దేశంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న కోట్లాది మంది ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమే" అని శ్రీధర్ అన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం మార్గంలో కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కుల, మత వివక్షలకు తావులేని సమాజ నిర్మాణం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. దేశాన్ని విభజించే రాజకీయాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ప్రతి ఒక్కరి గౌరవాన్ని కాపాడటం, సామాజిక సమానత్వాన్ని సాధించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. హల్ద్వానీ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి వివక్షాపూరిత చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ప్రజాస్వామ్య శక్తులు కఠినంగా వ్యవహరించాలని బీజేపీ దాని అనుబంధ సంఘాలను దేశంలో నుంచి బహిష్కరించాలని తిప్పర్తి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి శేషం కిరణ్,మీసాలసురేష్,బల్లెం చంటి,పడిశాల వెంకన్న,మంద పవన్ తేజ,శాకుల అజయ్,విసంపల్లి వెంకటేష్,బందెల చిన్నారి,ఆరేపల్లి సందీప్,విజయ్,చరణ్ సంతు,విజయ్,శ్రవణ్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఓట్ల కోసం అంబేడ్కర్ జపం !

దళిత జనోద్ధరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్ధరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేద్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుం టున్నారే తప్ప వారిని తోటి మానవులుగా ప్రభుత్వాలు రాజకీయ నాయకులు భావించడం లేదు. వారికి సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకన్నా నాయకుల ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. అంబేద్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు.ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యంగా మారింది. ఆయనకు ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరొకటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేద్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపు కుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కుతున్నామన్న భావన రాకుండా నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో అది



బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేద్కర్ పేరు ఉచ్చరించకుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్ధరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేద్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాడ్యాలు ఇంకా సమిసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మొహాన పడేసి దళితజన ఉద్ధరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబంధు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా..ఓహో అంటూ కాలం గడుపుతున్నారు. దళిత ఉద్ధరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. నిజంగానే మనం అంబేద్కర్ మహాను భావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాడలను పురుద్ధరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేద్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి.అంటరాని కులాలు ఆర్థికంగా బలపడనిదే, రాజకీయాధికారం పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేద్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమిసిపోతాయని భావించాడు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించనేలేదు. గాంధీజి వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేద్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి. అంబేద్కర్ పేరుతో చేసే రాజకీయాలను దునుమాడాలి. ఎన్నికల్లో ఐక్యత చాటాలి. తమను రాజకీయంగా వాడుకుంటున్న నేతల నిజస్వారూపాలను గుర్తించాలి. అప్పుడే అంబేద్కర్ మహాశయుడి ఆశయాలను సాధించగలం.

# రైతులను ఆదుకోలేని బీమా పథకాలు

ఎన్నికల్లో హామీలు ఇవ్వడం..గెలిచిన తరవాత నాలుక మడతేయడం నాయకులకు అలవాటుగా మారింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న మోడీ హామీ పదేళ్లయినా నెరవేరలేదు. నిజానికి దేశంలో పుష్కలంగా నీటివనరులు, సారవంతమైన భూములు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకునే ఇంజనీరింగ్ నైపుణ్యాలను పాలకులు ప్రదర్శించడం లేదు. నదీజలాలు సముద్రం పాలుకాకుండా...ఏటా వరదలతో అతలాకుతలం కాకుండా...ఆనకట్టలు కట్టాలన్న స్పృహలేకుండా పోతోంది. డబ్బుల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పనికారాకుండా పోతున్నాయి. నదుల అనుసంధానం అన్న మాటే మోడీ ఎత్తడం లేదు. దేశంలో అన్నిరకాల పంటలకు అనువైన నేలలు ఉన్నా, సమగ్ర పంటల విధానం రావడం లేదు. దీంతో రైతులకు పంటలను పండించడం ఎంత కష్టంగా మారిందో..అమ్ముకోవడం అంతకుమించిన భారంగా మారుతోంది. పంటల కొనుగోళ్లు,బీమాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన జాతీయ విధానాల ను అవలంబించడం లేదు. దీంతో పంటలు చేతికి వచ్చినప్పుడు ధరలు లేక పోవడం..పంటలు నష్టపోయి నప్పుడు బీమా సొమ్ము అందక పోవడం షరామామూలుగా మారింది. ప్రధానంగా వాణిజ్యపంటల విషయంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనిని సవాల్‌గా తీసుకుని రైతులకు అండగా నిలవాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా సరైన బీమా విధానం లేదు. ఉన్నా రైతులకు అవగాహన లేదు. దీనిని జాతీయ విధానంగా తీసుకుని రవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పంటలు నష్టపోతున్నరైతులకు సరైన బీమా సౌకర్యం అందడం లేదు. గ్రామాల వారీగా కాకుండా పంట వారీగా బీమా సౌకర్యం రావాల్సి ఉంది. వ్యవసాయం చుక్కాని లేని నావలా తయారవగా వాణిజ్య పంటల సాగు జూదాన్ని తలదన్నింది. మునుపటి ఏడాది మిర్చికి కాస్త రేటు పడటంతో ఖరీఫ్‌లో రైతులు అటు మళ్లారు. రికార్డు స్థాయిలో ఎపిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయింది. కౌలు రైతులకైతే లక్షన్నర. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో మిర్చికి తామర తెగులు పలు రాష్ట్రాల్లో వ్యాపించినందున జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాల్సిన కేంద్రం చేతు లెత్తేసింది. రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయకుండా లేఖలతో సరిపెట్టింది. వీరిద్దరి మధ్య రైతులు సమిధలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా మిర్చి రైతులను ఆదుకుందా అంటే అదీ లేదు. అధ్యయన కమిటీల పేరుతో కాలక్షేపం చేసింది. అలాగే గతంలో వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు స్వల్ప విస్తీర్ణానికి పదో



పరకో ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఎంత మందికి ఎంత మొత్తంలో ఎప్పటికి ఇన్సూరెన్స్ వస్తుందో పెద్ద పజిల్‌గామారింది. ఒక వైపు అంతుబట్టని తెగుళ్లు, వైరస్‌లు ఇంకో వైపు నకిలీ, కల్తీ విత్తనాల కారణంగా విపరీతంగా నష్ట పోతున్నారు. వీటిని తట్టుకోలేని రైతులు ఉసురు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకోవడానికి సమగ్ర పంటల బీమా ఉండాల్సిందే. రైతులు ఏ రకంగా పంటలు నష్టపోయినా అండగా ఉండేలా బీమా సౌకర్యం రావాల్సి ఉంది.పట్టెడన్నం పెట్టే రైతులు తమకు చిన్నబాధ వచ్చినా తట్టుకోలేని దైన్య స్థితిలో ఉన్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో పత్తి,మిర్చి పంటలతో పాటు,పసుసు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు తెగుళ్ల కారణంగా లక్షలాది రూపాయాల నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో సాగయ్యే రెండు ప్రధాన వాణిజ్య పంటలు మిరప, పత్తి రైతాంగం ఆసాంతం పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ప్రభుత్వ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మిర్చికి ఇటీవల రికార్డు ధరలు పెరిగాయి. కానీ ధరలు పలికిన సమయానికి మిర్చి బాగా దెబ్బతింటోంది. ఎపిలో ఎప్పటి నష్టాలకు అప్పుడే పరిహారం అంటున్న సర్కారు మిర్చి, పత్తి విషయంలో నాన్చుడు దారి పట్టి రైతులను క్షోభకు గురి చేస్తోంది. తామర తెగులు సోకి మిర్చి, నకిలీ విత్తనాల వలన పత్తికి నష్టం వాటిల్లగా, ఈ నష్టాలకు ప్రభుత్వ పూచీ ఏమిటో ఇప్పటికైతే స్పష్టత లేదు. వివిధ కారణాలతో పంట నష్ట పోయిన రైతులకు తక్షణం పరిహారం అందించి ఆసరా కల్పించాల్సిన సర్కారే సాకులు చెప్పి పరిహాసం ఆడటం అమానవీయం. పరిహారంపై రైతులకు కనీసం భరోసా సైతం కల్పించకపోవడం అన్యాయం. ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన మిర్చి, పత్తి రైతులు రోడ్డెక్కుతున్నారు. పత్తి రైతుల గోడు చెప్పనలవి కాదు. నకిలీ, కల్తీ, నాసిరకం విత్తనాల వలన పంట నష్టపో యిన రైతులకు కంపెనీల నుండి పరిహారం ఇప్పించేందుకు 2011లో ప్రభుత్వం ఇచ్చిన జీవో పైనా ఇలాగే కంపెనీలు కోర్టుకెళ్లాయి. ఇక్కడా ప్రభుత్వ స్పందన లేదు. దాంతో ప్రభుత్వం కంపెనీలకు అనుకూలంగా ఉందనే భావన కలుగుతోంది. గతంలోనూ నకిలీ మిర్చి నారు, మిర్చి విత్తనాలతో రైతులు నష్టపోయారు. ఇంతా జరుగుతున్నా ఆర్‌బికెలు, గ్రామ సచివాలయాలు, ఇంటెలిజెన్స్, పోలీస్, వ్యవసాయ శాఖలు ఏం చేస్తున్నాయో తెలీదు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. నష్టపోయిన మిర్చి, పత్తి రైతులను సత్వరం ఆదుకోవాలి. వారికి జాతీయస్థాయిలో పంటల బీమాను తీసుకుని రావాలి. అప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. ఈ వైపుగా ఆలోచనలు చేసి సమగ్ర పంటల బీమా అమల్లోకి తీసుకుని రావాల్సి ఉంది. అలాగే నకిలీ విత్తనాలు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి.

# ప్రజల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**- ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టని విపక్షం - మోడీ వికసిత భారత్ పేరుతో డంబాచారం**

**న్యూఢిల్లీ:** వికసిత భారత్ పేరుతో ప్రకటనలు మార్మోగుతున్నాయి. ప్రజలకు ఎలా మేలు చేశారో మోడీ గ్యారెంటీలతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ సామాన్యులకు మాత్రం ఏం మేలు జరిగిందో చెప్పడం లేదు. ఉచిత రేషన్ అంటున్నారు. కోట్లాది ఇళ్లు కట్టామని అంటున్నారు. ఇన్ని చేసినా ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థిక విధానాలు సామాన్యులకు గుదిబండగా మారుతున్నాయి. వారి ఆర్థిక జీవనచిత్రం ఛిద్రం అవుతోంది. తాజాగా కేంద్ర ఆర్థికశాఖ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఈ విషయాలపై పార్లమెంటులో ఎక్కడా చర్చించడం లేదు. రాజకీయంగా తమకు లబ్ది చేకూర్చే విషయాలపై మాత్రమే విపక్షాలు గొంతెత్తుతున్నాయి. అందుకోసం పార్లమెంట్ సమావేశాలను స్తంభింప చేస్తున్నాయి. నిజానికి అంతకు మించిన సంక్షోభం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పాన్ నంబర్‌తో ఆధార్ లింక్ చేయడం...వచ్చే ఆర్థిక సంవత్సరం జీవితబీమా మొత్తంపై టాక్స్ విధిస్తూ తీసుకున్న నిర్ణయాలు పేద,మధ్య తరగతి ప్రజలపై పెనుభారంగా మారబోతోంది. ఈ దొంగ దోపిడీ నిర్ణయాలను విపక్షాలు కనీసం గమనించినట్లుగా కూడా లేదు. ఇప్పటికే పాన్‌తో ఆధార్ లింక్ అయివుంటే ఫర్వాలేదు.. కానీ లింక్ చేయాల్సిందే. దీనికి కూడా ఐటి విభాగం ఒక్కో వ్యక్తికి వేయ రూపాయలు వసూలు చేస్తోంది. ఇక నెట్ సెంటర్లలోకి వెళ్లి లింక్ చేసుకోవాలంటే అదనంగా మరో 200 రూపాయలు కట్టాల్సి వస్తోంది. ఇది సామాన్యులపై ఎంతగా భారం పడుతుందో కేంద్ర పాలకులు గమనించడం లేదు. ప్రతి పనికీ ఆధార్, పాన్ అవసరం కావడంతో ప్రజలు తప్పనిసరిగా లింక్ చేసుకుం టున్నారు. ఇదికూడా కేంద్రానికి ఆదాయ వనరుగా మారింది. ఇలా లింక్ చేయడం వల్ల కేంద్రానికి కనీసంగా ఓ 40,50వేల కోట్ల ఆదాయం సమకూర బోతోంది. అలాగే లింక్ చేయకుంటే 50వేలకు పైగా లావాదేవీలపై పదివేల వరకు పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఇది ప్రజల్లోకి పెద్దగా వెళ్లడంలేదు. దీనిని వెంటనే ప్రజలు గమనించి ముందుకు వెళితే మంచిది. ఇకపోతే ప్రజలు పైసాపైసా పొదుపు చేసుకుని కట్టే జీవితబీమా పాలసీపైనా ఇప్పటికే జిఎస్టీ వసూలు చేస్తున్నారు. హెల్త్ పాలసీలపైనా జిఎస్టీ పేరుతో దండుకుంటున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఎవరైనా కూడా కొత్తగా జీవితబీమా చేయదల్చుకుంటే... పాలసీ మెచ్యూరిటీ అయిన తరవాత వచ్చే రాబడిపైనా పన్ను విధించబోతున్నారు. ఇది కనీసం 6శాతంగా ఉండబోతోంది. మోడీ ప్రభుత్వం ఇలా ప్రజలను వేపుకుతింటున్న తీరును ప్రజలు గమనించాలి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు మోత మోగిస్తున్నాయి. అయితే తెలివిగా ఎన్నికల ముందు వంద రూపాయలు తగ్గించారు. పెట్రోధరలు మంటపెడుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్‌టీ వరకు ప్రజల జీవితాలను మోడీ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతు న్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడాల్సిన దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. అయినా తమేదో ఘనకార్యం చేస్తున్న ట్లుగా బిజెపి పాలకులు బాకాలు ఊదుతు న్నారు. కాంగ్రెస్ కూడా ఇలాంటి సమస్యలపై ఫోకస్ చేయడం లేదు. వారు కూడా ఓట్ల కోసం నగదు బదిలీ పథకాలనే నమ్ముకున్నారు. మహిళలకు ఏటా లక్ష వరకు ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. ఇప్పటికే జీఎస్టీ భయాలు వెన్నాడు తున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు ఈ ప్రభుత్వం భరోసగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులుకుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెం టులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే గత పదదేళ్ల కాలం గడిపారు.

## పౌల్ట్రీ పరిశ్రమలో నష్టాలే ఎక్కువ

**- ధరలు పెరుగుతున్నా నష్టాలే అధికం**

**- పరిశ్రమల యజమానుల ఆవేదన**



**విజయవాడ:**కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుఊడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంఉకుంటోంది. కరోనా కారణంగా పౌల్ట్రీ రంగం కుదలేయ్యింది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. అన్నిరంగాలను దెబ్బేసింది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరసతో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది. దీనిపై ఆధారపడ్డ అనేక అనుబంధ పరిశ్రమలూ దెబ్బతింటాయి. దీని నుంచి గట్టెక్కకపోతే ఈ రంగంపై ఆదారపడి జీవిస్తున్న లక్షలాదిమందికి ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.

## దేశ సమస్యలపై స్పష్టమైన హామీ ఏదీ ?


దేశంలో మళ్లీ తమదే అధికారం అని బిజెపి ఘంటాపథంగా చెబుతోంది. ఎన్‌డిఎ 400 సీట్లు సాధిస్తుందన్న ధీమాలో ఉంది. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, ఇండియా కూటమికి ప్రజల అండలేదని ప్రచారం చేసు కుంటోంది. ఈ క్రమంలో బిజెపి పదేళ్ల పాలనను గీటురాయిగా తీసుకుంటే..అనేక విషయాలు చర్చించాల్సి ఉంటుంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తు న్నారు. నోట్ల రద్దు కారణంగా సామాన్యులు పడ్డ ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిరుద్యోగం చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళు తున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి చిహ్నమా అన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్‌కు ఇదంతా నిదర్శనంగా చూడాలి. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. ఈ క్రమంలో బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఈ అంశాలేవీ చర్చించలేదు. సరికదా స్పృశించలేదు. దేశంలో రైతులు కీలకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. దీంతో ఈ వర్గాన్ని ఆకట్టుకునేందుకు రెండు పార్టీలు ప్రయత్నించాయి. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో పాటు.. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను బలోపేతం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరపెంచుతామని తెలిపింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. వ్యవసాయ ఫైనాన్స్‌పై శాశ్వత కమిషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. కానీ రెండు పార్టీలు ఈ రంగంపై పెద్దగా విశ్లేషణ చేయడం లేదు. మహిళా సాధికారత సాధించే దిశగా గ్రామీణ మహిళలను లక్షాదికారులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో తెలిపింది.మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదింటి మహిళకు షరతులు లేకుండా ఏడాదికి లక్ష రూపాయిలు నేరుగా ఖాతాల్లో జమచేస్తామని తెలిపింది. 2025 నుంచి మహిళలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు. ప్రతి జిల్లాలో కనీసం ఒక సావిత్రీబాయి పూలే హాస్టల్‌తో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని తెలిపింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 25 లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామిన కాంగ్రెస్ తెలిపింది. . ఇలాగే వెళితే దేశంలో సామాన్యులు, పేదలు, మధ్యతరగతి వాళ్లు బతకడం కష్టం కాగలదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారేలా ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 19న తొలివిడత పోలింగ్ జరగనుంది. ఏడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాలను సిద్ధం చేశాయి. ముందు ప్రజలను ఆకర్షించేందుకు మేనిఫెస్టోలతో అన్ని పార్టీలు సిద్దం అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. తమను గెలిపిస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర్ ' పేరుతో బీజేపీ 'సంకల్ప్ పత్ర్' పేరుతో ఎన్నికల ప్రణాళికను విడుదల చేశాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్, బీజేపీ తమ తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. మోదీ గ్యారెంటీ క్యాప్షన్‌తో బీజేపీ సంకల్ప్ పత్ర్ విడుదల చేయగా.. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ న్యాయ పత్ర్‌ను రూపొందించింది. ఓ రకంగా చెప్పాలంటే రెండు పార్టీలు యువతను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. ఎందుకంటే యువ ఓటర్ల సంఖ్య దేశంలో గణనీయంగా పెరిగింది. బీజేపీ తన మేనిఫెస్టోలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేశామని, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపింది. కానీ పదేళ్ల పాలనా కాలంలో ఉద్యోగాల కల్పన అన్నది లేకుండా పోయింది. ప్రచారాడంబరం తప్ప ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడుతోంది. ఉన్నత చదువులు చదివినా కొలువులు కానరావడం లేదు. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచుతామని బిజెపి మరోమారు యువతను మోసం చేసే ప్రయత్నం చేసింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాల పరిమితిని పెంచుతామని కూడా పేర్కొంది. కానీ ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీని ప్రకటించలేదు. అయితే ఇందుకు భిన్నంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యువ న్యాయ్ కార్యక్రమం అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 25 ఏళ్లలోపు యువకుల కోసం రైట్ టు అప్రెంటీస్‌షిప్ చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామిన తెలిపింది. అధికారంలో ఉన్న బిజెపి మాత్రం ప్రభుత్వ ఖాళీల భర్తీకి ముందుకు రాలేదు. ఇకపోతే సీనియర్ సిటిజన్ల కోసం రెండు పార్టీలు తమ మేనిఫెస్టోలో వివిధ హామీలు ఇచ్చాయి. 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు అందిస్తామని తెలిపింది. తీర్థయాత్రలు చేపట్టే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను కఠినంగా అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులకు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద పెన్షన్‌ను వెయ్యి రూపాయిలకు పెంచుతామని చెప్పింది. సీనియర్ సిటిజన్లకు ప్రజా రవాణాలో ప్రయాణ రాయితీలను పునరుద్దరిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. రెండు పార్టీలు అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా తమ మేనిఫెస్టోలో పథకాలను పొందుపర్చాయి. కానీ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ఈ రెండు పార్టీలకు లేదని గతంలో వీరి పాలనా కాలం తీరు చూస్తే అర్థం చేసుకోవచ్చు



## బాలీవుడ్ బాట పట్టిన మీనాక్షి

హిట్ 2, లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మీనాక్షి చౌదరి బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా రాజ్ శాండిల్య దర్శకత్వంలో రూపొందుతోన్న 'భాగమ్ భాగ్ 2'లో ఈ ముద్దుగుమ్మ కథానాయికగా ఎంపికైంది. గతంలో వచ్చిన సూపర్‌హిట్ కామెడీ మూవీ 'భాగమ్ భాగ్'కు ఈ సినిమా సీక్వెల్ కావటం విశేషం. తొలి భాగం తరహాలోనే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నదని, మీనాక్షి కెరీర్‌లో ఓ మైలురాయిగా ఈ సినిమా నిలువనున్నదని బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ నెలలోనే షూటింగ్ ప్రారంభించి, ఈ ఏడాది చివరిలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్, అయేషాఖాన్ ఇందులో కీలక పాత్రధారులు.

## 'కల్కి 2'కు సర్వం సిద్ధం?



'కల్కి 2898ఏడీ' చిత్రం పానిండియా స్థాయిలో సృష్టించిన సంచలనం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు పన్నెండొందల కోట్లు వసూలు చేసి ప్రభాస్ స్టామినా ఏంటో మరోసారి రుజువు చేసిందీ సినిమా. ఇప్పటివరకూ వచ్చిన ఫ్రాంచైజీల్లో తొలి పార్ట్‌కు ఇంత వసూళ్లు రావడం 'కల్కి 2898ఏడీ' విషయంలోనే జరిగింది. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ పార్ట్ కోసం ఆడియన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సెకండ్ పార్ట్‌కు సంబంధించిన కొంత పుటేజ్ ఇప్పటికే సిద్ధంగా ఉందని, మిగతా షూటింగ్‌కు ఎక్కువ సమయం పట్టదని గతంలో మేకర్స్ ప్రకటించారు. మరి ప్రభాసేమో ఫౌజీ, స్పిరిట్ షూటింగుల్లో బిజీగా ఉన్నారు. అందుకేనేమో.. అమితాబ్‌తో షూటింగ్ మొదలుపెట్టబోతున్నారు 'కల్కి 2' యూనిట్. ఇది నిజంగా డార్లింగ్ అభిమానులకు శుభవార్తే. ప్రస్తుతం 'కల్కి 2' పనిమీద బిగ్‌బీ హైదరాబాద్‌లోనే ఉన్నారు. త్వరలోనే ఆయన మళ్లీ అశ్వత్థామగా మారబోతున్నారు. ఇంకొన్ని రోజుల్లోనే షూటింగ్ మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ లేని సీక్వెన్స్‌ని షూట్ చేస్తారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.



## ఓ హింసాత్మక ప్రపంచం



ఈ ఏడాది ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఒకటి. 'కేజీఎఫ్'ఫేం యష్ కథానాయకుడిగా నటిస్తూ వెంకట్ కె.నారాయణతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకురాలు. కియారా అద్వానీ, నయనతార, రుక్మిణీవసంత్ కథానాయికలు. హ్యూమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రధారులు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అలాగే సినిమాపై అంచనాలను కూడా పెంచింది. తాజాగా శుక్రవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఓ కొత్త హింసాత్మక ప్రపంచాన్ని ఈ టీజర్ ఆవిష్కరించింది. సర్కస్ వాతావరణం, తూర్పు ఆసియా శైలిని గుర్తు చేసే ప్రపంచం ఇలా వివిధ కాలాల్లో కథ ప్రయాణిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. ఇందులో యాక్షన్ సన్నివేశాల్లో హింస ఎక్కువగా కనిపిస్తున్నా.. అంతర్గతంగా ఏదో లోతైన భావాన్ని ఆ హింస ఆవిష్కరిస్తున్నది. టేకింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ, నటీనటుల శక్తివంతమైన నటన ఈ టీజర్‌కు హైలైట్స్. ఇందులో హీరో యష్ ఓ విపత్తులా కనిపిస్తున్నాడు. రూపం, లోతైన హావభావాలు పాత్రలోని తీవ్రతను, ఉద్వేగాన్ని తెలియజేస్తున్నాయి. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో ఈ సినిమా విడుదల కానున్నది.

## ఇండో అమెరికన్ మూవీలో..

వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా దూసుకుపోతున్నది బెంగళూరు భామ ప్రియమణి. 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్ బాలీవుడ్‌లోనూ ప్రియమణికి మంచిపేరు తెచ్చిపెట్టింది. ఆమె కీలక పాత్ర పోషించిన విజయ్ 'జననాయగన్' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఇదిలావుంటే.. అత్యంత భారీ స్థాయిలో నిర్మించనున్న ఓ ఇండో అమెరికన్ ప్రాజెక్ట్ కోసం ఓ ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఇటీవలే ప్రియమణిని సంప్రదించారు. అందులోని కీలక పాత్రకోసం ప్రియమణిని ఎంపిక చేసుకున్నారు. హర్ష్ మహాదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం.. ఇండో అమెరికన్ సంస్కృతుల నేపథ్యంలో ఒక వలస కుటుంబం కొనసాగించే సున్నితమైన భావోద్వేగ ప్రయాణమని తెలుస్తున్నది. ప్రముఖ బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సివుంది.